


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -155-

**(30 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఈ రోజుల్లో చదువుల** విషయం చాలా గందరగోళంగా వుంది. అసలు పేర్లు తెలుసుకోవడమే కష్టంగా ఉంది. ఎన్నో క్రొత్తపేర్లూ, పద్దతులూ అమలులోకి వచ్చాయి – వస్తున్నాయి.

పూర్వం అయిదో తరగతి నుంచి పాఠాలు ప్రారంభమయ్యేవి కాలేజీలో జేరితే యఫ్,ఏ – బి.ఏ – ఎం.ఏ. వీటిని జ్ఞాపకం పెట్టుకోవడం తేలిక. పోతే ఉపాధ్యాయవృత్తిలోకి దిగతలచిన వారికి ఎల్.టి డిగ్రీ, ప్లీడరు పట్టాకోసం వెళ్ళేవారికి బి.ఎల్ డిగ్రీ వుండేవి. ట్రయినింగ్‌లో అయిదోక్లాసు, థర్డుఫారం, స్కూలు ఫైనల్ ట్రయినింగ్లుండేవి.

థర్డుఫారం చదివి ట్రయినింగ్‌కు వెళ్ళి బడిపంతులై హాయిగా జీవితం గడిపినవారనేకమంది వుండేవారు. ఇప్పుడలాటి పద్ధతులు తగ్గిపోయాయి.

బి.ఏ ప్యాసయిన వాళ్ళకు ఎల్.టి.లు పోయాయి. బి.ఇడి లు వచ్చాయి. పాఠశాలలు అమితంగా పెరిగిపోవడం వల్ల అనేకమంది టీచర్లు కావలసివస్తున్నారు. సరస్వతిదేవికి అంతులేని దేవాలయాలు వెలిసాయి. అది సంతోషకరమైన విషయమే కాని అచ్చమైన స్వచ్ఛమైన, పవిత్రమైన పూజారుల బృందం కూడా అవసరం కదా.

హైస్కూలు క్లాసుల వరకూ బి.ఇ.డి పూజారులు కావాలి. ప్రతి ఏటా స్కూళ్ళు పెరుగుతున్నాయి. టీచర్లు పెరగడం లేదు. పోనీ ఉపాధ్యాయవృత్తి అవలంబిద్దామనుకున్నా బి.ఇడి సీట్లు దొరకడంలేదు. ఏ పంజాబ్ లాటరీలోనన్నా ఫస్టు ప్రయిజ్ కొట్టడం తేలికేమోగానీ బి.ఇ.డి సీటు దొరకడం దుర్లభంగా వుంది. ఫస్టు క్లాసు బి.ఏ – బి.యస్‌సి లకే సీట్లు. తక్కినవాళ్ళు డిగ్రీలు తీసుకుపోయి పాత ట్రంకుపెట్టెలో పడేసి మూత పెట్టవలసిందే.

ఈ మధ్య ఒకాయన అన్నారు. అసలు బి.ఇ.డీ సీటు ఇచ్చేముందు ఒక ప్రవేశ పరీక్ష పెట్టాలి. దాంట్లో ఒక్క చదువు విషయంలోనే కాక, స్వభావం, ప్రధానం మొదలైన గుణాల్ని పరిశీలించాలి. ముభావంగా వుండే వారిని ఉపాధ్యాయ పదవుల్లోకి తీసుకోకూడదు. విద్యాభిమానం, దేశాభిమానం మొదలైన గుణాలక్కూడా ప్రాధాన్యమివ్వాలి.

కాని ఇలాటివన్నీ జరిగే విషయాలు కావు. అలాటి గురుకుల న్యాయాల మీద అభిమానం కలవాళ్ళు ఏదో కథలో, నవలలో వ్రాసుకోవాలిగాని అలాటి ఉపాధ్యాయుల్ని తయారు చెయ్యాలని ఉబలాటపడటం వల్ల ప్రయోజనం వుండదు.

కనుక ఫస్ట్‌క్లాస్ వచ్చినవారే ఉపాధ్యాయులుగా వుండటానికి అర్హులు. కాలేజీలలో ఫస్ట్‌క్లాస్ ఎం.ఏలే వుండితీరాలి. మేం చదువుకునే రోజుల్లో బి.ఏ ప్యాసయిన వాళ్ళే బి.ఏకి చెపుతూ వుండేవారు. ఎఫ్ ఏ తప్పిన ఒక పెద్ద మనిషి మాకు అయిదో ఫారంలో హిస్టరీ చెప్పేవాడు. అయనకు గొప్ప టీచరని పేరుండేది. మాకు ఆయన చెప్పిన పాఠాలింకా జ్ఞాపకం వున్నాయి.

ఇప్పుడా పప్పులేం ఉడకటంలేదు. బి.ఇ.డీలు కానివాళ్ళు హైస్కూలు ప్రాంగణంలో అడుగు పెట్టడానికి వీలులేదు. చదువు రాకపోతే విద్యార్థుల లోపం. ఉపాధ్యాయులు గట్టివాళ్ళు. డిగ్రీలున్నవాళ్ళు కనుక విమర్శించే అవకాశంలేదు అంటున్నారు.

పోతే డిగ్రీలలో మార్పులు అనేకం వచ్చాయన్నాం. పూర్వం బి.ఎల్. డిగ్రీపోయి ఎల్.ఎల్.బిలు వచ్చాయి. వ్యత్యాసం ఏమిటో తెలియదుగాని వృత్తి మాత్రం ఒకటే క్రొత్తగా ఎల్.ఎల్.బి డిగ్రీలు వచ్చిన రోజుల్లో ఒకాయన "నాకేసు తీసుకువెళ్ళి ఎల్.ఎల్.బికి ఇచ్చానిప్పుడే" అని గర్వంగా చెప్పుకున్నాడుట. 'ఏమిటి బి.యల్.కి ఆయనకూ భేదం' అని ప్రశ్నిస్తే 'క్రొత్త క్రొత్తే, పాత పాతే. అదీకాక డిగ్రీలో ఒక్క అక్షరం ఎక్కువ వుంది కదా?' అన్నాడుట.

డిగ్రీలలో మార్పులు వచ్చినప్పుడల్లా ప్రజలు తికమకలు పడటం మామూలే. అది మంచిదా, ఇది మంచిదా? అని సందేహంలో పడటం జరుగుతూ వుంటుంది. ఒక వర్తక ప్రముఖుడికి ఓ ఉద్యోగి కావలసి వచ్చాడుట. మెట్రిక్ చదివినవాడైనా సరేనని ప్రకటన చేశాడుట.

వచ్చిన అప్లికేషన్లలో సెవెంతు ఫారం టెంత్ క్లాసు అంటూ వున్నాయట కొన్ని అర్జీలు. పన్నెండో క్లాసువాళ్ళే వస్తుంటే ఏడోఫారం వాళ్ళెందుకు? వాళ్ళ కాగితాలు తీసెయ్యమన్నాడుట.

ఈరోజుల్లో కుర్రవాళ్ళు చదువులు, తల్లితండ్రులకే సరిగా తెలియవు. 'మీవాడు కాలేజికెప్పుడు వెడతాడు?' అని అడిగితే ' మావాడా వెడ–తాడల్లేవుంది ఈ సంవత్సరం. లేకపోతే పై సంవత్సరం తప్పదు' అని తండ్రి చెప్పాడు.

"ఇంకా నయం పై సంవత్సరమేమిటి? ఈ యేడే వెడతాడు. చదువు పద్దతులు మారాయిగా. జూనియర్ కాలేజీలు పెట్టారుగా. వాడే చెప్పాడు ఈ ఏడు వెడతానని" అని తల్లి చెపుతుంది.

"ఏమో ఎక్కడికి ఎప్పుడు వెడతాడో తెలియడంలేదు. సర్టిఫికెట్ తీసుకుని వెళ్ళి జీతం ఎక్కడ కట్టమంటే అక్కడ కట్టడం. ఏ క్లాసులో కూర్చోమంటే అక్కడ కూర్చోవడం" అంటాడు తండ్రి.

"ఇంతకీ మీ అబ్బాయి ఏ క్లాసు?" అని వచ్చినవాళ్ళు ప్రశ్నిస్తే

"అదేదో పన్నెండట. దాన్నే మల్టీపర్‌పస్ అంటారుట. ఇంకో స్కూల్లో హెచ్.యస్.సి అంటారుట. కొన్నిట్లో ఇంకేదో అంటారుట. ఈ పేర్లనుకూడా ఆంధ్రనామ సంగ్రహంలో చేర్చనట్టేననుకుంటా" నంటూ చెప్పుకొస్తాడు తండ్రి.

"మల్టీపర్‌పస్‌కి మళ్ళీ మన మూడు విశ్వవిద్యాలయాల్లో మూడు పద్ధతులున్నాయట. వీటిని గురించి వివరాలు విచిత్రంగా వుంటాయి. ఇప్పుడు పేర్లను గురించి, పాఠ్యగ్రంధాల్ని గురించి ఆలోచించడం అంత మంచిది కాదు. కాలేజీదాకా చదువుకుంటూ వెళ్ళడమే. పైగా ఇంకో చిక్కు ఏ క్లాసుకు పరిక్షలెప్పుడో కూడా ఎవరికీ తెలియదు. ఒక సంవత్సరంలో చదువుకు మరో సంవత్సరంలో పరీక్షలు జరుగుతున్నాయి.

ఫలితాలు వచ్చిన వెంటనే క్రొత్త సంవత్సరం ప్రారంభం అవుతోంది అంతేగాని 'మరో కాలం' అని తెలియడంలేదు. అసలు వేసవి కాలం సెలవులు కొన్ని స్కూళ్ళకి, కాలేజీలకూ వుండనే వుండటంలేదు. గాడ్పుల్లో చదువులు చల్లటికాలంలో సెలవలు. విద్యార్ధులు చెయ్యవలసిన పని చదువుకుంటూ పోవడం. తల్లితండ్రులు చెయ్యవలసిన పని జీతాలు కడుతూ పోవడం. ఉపాధ్యాయులు చెయ్యవలసిన పని పాఠాలు చెప్పుకుంటూ పోవడం. పరీక్షాధికార్ల పని సిలబస్‌లు, రూల్సు, వగైరాలు మార్చుకుంటూ పోవడం. ప్రభుత్వం పని జీతాలు ప్రకటిస్తూ వుండటం అంతే.

Post your comments